## క్లుప్తంగా

### పీహెచ్‌సీ వైద్యాధికారిగా 'చిట్టూరి'



వాకతిప్పలో రాకేష్ చౌదరికి అభినందనలు తెలుపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

కపిలేశ్వరపురం: వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రమౌళి ఉన్నత చదువుల కోసం వెళ్లడంతో పీహెచ్‌సీలో తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో డాక్టర్ చిట్టూరి రాకేష్ చౌదరికి పీహెచ్‌సీ వైద్యాధికారి బాధ్యతలను అప్పగించారు. ఇక నుంచి పీహెచ్‌సీ నిర్వహణలో డ్రాయింగ్ పవర్‌తో రాకేష్ చౌదరి బాధ్యతలను నిర్వహించనున్నారు. శనివారం రాకేష్ చౌదరికి పీహెచ్‌సీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

### నేడు 'నవ సమాజం కోసం' పుస్తకావిష్కరణ

కపిలేశ్వరపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాలతో కూడిన 'నవ సమాజం కోసం' పుస్తకాన్ని కాకినాడలో ఆదివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆవిష్కరించనున్నట్టు ఆ పార్టీ సీనియర్ నాయకుడు పెద్దింశెట్టి రామకృష్ణారావు శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 1934–64 మధ్య కాలంలో ఉవ్వెత్తున ఎగిసిన కమ్యూనిస్టు ఉద్యమాలను సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు దువ్వ శేషబాబ్జి పుస్తక రూపంలో రచించారన్నారు. కాకినాడ సినిమా రోడ్డులోని అన్నదాన సమాజం వద్ద నిర్వహించే పుస్తకావిష్కరణను విజయవంతం చేయాలని రామకృష్ణారావు కోరారు.

### నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 16 వరకూ నిర్వహించనున్నట్టు అర్చకులు పెద్దింటి వెంకటలక్ష్మీనరసింహాచార్యులు, ప్రసన్నకుమార్ భార్గవ్, సంపర లక్ష్మీనరసింహ భాస్కర శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు దేవతామూర్తులను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయడం, 10న నిత్య హోమం, నీరాజన మంత్రపుష్పాలు, స్వామివారి ఆలయం నుంచి పోలేరమ్మ ఆలయం వరకూ రథోత్సవం, కల్యాణం, 11న విశేషార్చన, 12న సదస్యం, పండితాశీర్వచనం, 13న అర్చకుడు సంపర వేణుగోపాల సింగుబాబుతో చోర సంవాద కథాశ్రవణం, 14న వాహనాల ఊరేగింపు, 15న శ్రీపుష్పయాగం, 16న ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నట్టు అర్చకులు వివరించారు.

### పసలపూడిలో కైలాస భూమి ప్రారంభం



పసలపూడి కైలాసభూమిలో శివుని విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జోగేశ్వరరావు

రాయవరం: మండలంలోని పసలపూడిలో దాతల సహకారంతో అభివృద్ధి చేసిన కైలాస భూమిని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోగేశ్వరరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ కైలాస భూమిని అభివృద్ధి చేయడంతో పాటు వసతులు కల్పించిన గ్రామాభివృద్ధి కమిటీని అభినందించారు. రుద్రభూమిలో శివుని విగ్రహం, ఇతర అభివృద్ధి పనులను రూ.27.50 లక్షలతో చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా ప్రస్తుతానికి దాతల నుంచి రూ.22.50 లక్షల సహకారం అందినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు మరింత సహకారం అందిస్తే మరిన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కైలాస భూమి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పెద్దింట్లమ్మ అమ్మవారి ప్రభ ఊరేగింపు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ప్రభ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశాలపై గత నెల 28వ తేదీ నుంచి మార్చి 28వ తేదీ వరకూ ఉత్సవాలను ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో అంతర్వేది దేవస్థానం, పోలీసు, రెవెన్యూ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్ పర్యవేక్షణలో ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, అంతర్వేది ఆలయ సిబ్బంది, స్థానిక ఆసాదులు అమ్మవారి ప్రభ ఊరేగింపు గ్రామ పురవీధులలో ట్రాక్టర్‌పై నిర్వహించారు. అలాగే రాత్రి గోకర్ణేశ్వరస్వామి, జలదుర్గ అమ్మవారి కల్యాణం భక్తులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉత్సవాల నిర్వహణకు ఆలయ పరిధిలోని రెండు వర్గాల మధ్య విభేదాలు ఉండడంతో పైస్థాయి అధికారు లు ఇచ్చిన ఆదేశాలుకు అనుగుణంగా ఆయా శాఖలు సంయుక్తంగా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.



కపిలేశ్వరపురం సీహెచ్‌సీలో మహిళా డాక్టర్లను సత్కరిస్తున్న పీఎంపీ వైద్యులు



డాక్టర్ జ్యోతిర్మయిని సత్కరిస్తున్న పీఎంపీ సభ్యులు



మారేడుబాకలో మహిళలను సత్కరిస్తున్న సర్పంచ్, నాయకులు



గొల్లపాలెంలో సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ భువనేశ్వరిదేవిలను సత్కరిస్తున్న పీఎంపీ సభ్యులు

# వనితకు వందనం

- ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలు
- అతివలకు సత్కారం




మండపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, మహిళలు

కపిలేశ్వరపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. కపిలేశ్వరపురం సీహెచ్‌సీలో మహిళా వైద్యులను సత్కరించారు. అంగరలోని శ్రీశ్రావణి క్లినిక్ ప్రాథమిక వైద్యశాలలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ల రాంబాబు పర్యవేక్షణలో అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడకు చెందిన డాక్టర్ వి.అనితను సత్కరించారు. శ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అద్దంకివారిలంకలో నిర్వహించిన సదస్సులో సంస్థ కో ఆర్డినేటర్ బి.నాగేశ్వరి మాట్లాడుతూ ఆధునిక కాలంలో మహిళా శక్తి ప్రాధాన్యం పెరిగిందన్నారు. వ్యవసాయ రంగం నుంచి రాజకీయ రంగం వరకూ అన్ని రంగాల్లోనూ మహిళలు ప్రతిభను కనబర్చుతున్నట్టు తెలిపారు. మహిళలకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, పీఎంపీ అసోసియేషన్ నాయకులు సూరంపూడి సత్యనారాయణ, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మండపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండపేట పట్టణ, రూరల్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో సీఐ దారం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలువ పువ్వు సెంటర్ నుంచి గుమ్మిలేరు రోడ్డు వరకూ విద్యార్థులు, మహిళలతో ర్యాలీ నిర్వహించారు. కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. మహిళలకు ఏ సమస్య వచ్చినా పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందించారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా డాక్టర్లు బిక్కిన పద్మ, ఇమ్మిడిశెట్టి జ్యోతిర్మయిలను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ నాయకులు కోన సత్యనారాయణ, బల్లా వెంకటరమణ, ఇరవాడ రవికుమార్, మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక తపాలా కార్యాలయంలో పోస్టు మాస్టర్ ఎంవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో కొండపల్లి సూర్యనారాయణ, కేవీవీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

**మహిళలకు సత్కారం**

మండపేట: మారేడుబాక పంచాయతీ కార్యాలయం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత మట్టపర్తి గోవిందరాజు ఆధ్వర్యంలో పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలు, మహిళా ప్రజా ప్రతినిధులను సత్కరించారు. ఈ సందర్భంగా గోవిందరాజు మాట్లాడుతూ సమాజంలో మహిళ పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చొల్లంగి సత్యవేణి, ఉప సర్పంచ్ టేకి దుర్గారావు, నాయకులు పుట్టా మాధవరావు, రాయుడు గంగరాజు, పసలపూడి శ్రీను, కార్యదర్శి వరప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మండపేట: మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆధ్వర్యంలో శనివారం రాత్రి మున్సిపల్ కౌన్సిల్ హాలులో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై చైర్ పర్సన్, మహిళా కౌన్సిలర్లను ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎర్నేని ప్రభావతి, ముక్కా లోవలక్ష్మి, నీలం దుర్గమ్మ, జొన్నపల్లి విజయలక్ష్మి, బొక్కా సరస్వతి, మలసాని సీతామహాలక్ష్మి, కొవ్వాడ బేబి తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా మహిళా దినోత్సవం**

కాజులూరు: ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని ఈ విధానంలో భారతదేశం ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచిందని పీఎంపీ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు కొప్పాక శివప్రసాదరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గొల్లపాలెంలో గల కమ్యూనిటీ పారామెడికల్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ (పీఎంపీ అసోసియేషన్) భవనంలో కాజులూరు, కరప మండల యూనిట్ అధ్యక్షుడు జేవీవీ సూర్యనారాయణ అధ్యక్షతన మహిళలకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పాక శివప్రసాదరావు, రాష్ట్ర నాయకుడు కేఎస్ఎన్ బాబుల ఆధ్వర్యంలో సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, ఫిజియోథెరపిస్ట్ ఈశ్వరి, ఎంవీవీ లక్ష్మి, సుబ్బలక్ష్మి తదితర మహిళా పీఎంపీలను సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆర్.వినయ్‌కుమార్, మండల కోశాధికారి పీఎల్ శ్రీనుబాబు, సంఘం నాయకులు కేఎస్ ఆచార్యులు, షేక్ మస్తాన్, కాకినాడ టౌన్, యానం అధ్యక్షులు సీహెచ్ ఏడుకొండలు, సీహెచ్ శ్రీనివాస్, తాళ్లరేవు మండల కార్యదర్శి షేక్ రెహమాన్, జిల్లాలోని పలు మండలాలకు చెందిన నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

**హసన్‌బాదలో..**

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో శనివారం సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి, ఏఎన్ఎం వెంకటరమణ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ధరణి, మహిళా పోలీస్ లలిత, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, లక్ష్మి, డ్వాక్రా యానిమేటర్ మణి తదితరులు గడచిన 5 సంవత్సరాలుగా గ్రామంలో చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ గ్రామస్తులకు ఎనలేని సేవలు అందించారని వారిని అభినందించారు. దుశ్శాలువాలతో సత్కరించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నీలం భవాని, వార్డు సభ్యులు గొల్లపల్లి పద్మరాజు, కొండాయపాలెపు వీరబాబు, వీఆర్ఓ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



అద్దంకివారిలంకలో మాట్లాడుతున్న శ్రమ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ నాగేశ్వరి



మండపేటలో కేక్ కట్ చేస్తున్న మహిళా కౌన్సిలర్లు



హసన్‌బాదలో మహిళా ఉద్యోగులను సత్కరించిన సర్పంచ్ సతీష్‌రావు తదితరులు

## వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించాలి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల
- ద్వారపూడి పీహెచ్‌సీ డాక్టర్ తీరుపై మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా హాజరై పలు సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి మాట్లాడుతూ రూరల్, అర్బన్ ప్రాంతాల్లో 68 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 16 పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో సమూల మార్పులకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ద్వారపూడి పీహెచ్‌సీ డాక్టర్ జగదీష్ ఆసుపత్రుల కోసం మాట్లాడుతుండగా ఆయనపై ఎమ్మెల్యే వేగుళ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మూడు సార్లు సందర్శనకు వచ్చానని, ఆ సమయంలో ఆసుపత్రిలో లేకుండా ఎక్కడి వెళ్లారని ప్రశ్నించారు. డాక్టర్ పనితీరుపై చాలా ఫిర్యాదులు అందాయని, ఇక నుంచి సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. లోఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు ప్రతి గ్రామానికి ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయని, వాటిని కేంద్రప్రభుత్వ పథకం అమలులో ఉండగా ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ అధికారులకు సూచించారు.

**సమస్యలపై గరం**

కాగా పలువురు సభ్యులు గ్రామాల్లో సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్ తేజేశ్వరరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇష్టానుసారం లే అవుట్లు వేస్తున్నారని, దీనివల్ల పక్కన ఉన్న సరిహద్దు స్థలాలపై ప్రభావం పడుతుందన్నారు. ఈ సమస్య మండలంలో ఎక్కువగా ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, వైస్ ఎంపీపీ గజ్జి రమణ, కార్యదర్శులు, సూపరింటెండెంట్ ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## సంక్షేమ ఫలాలు అందినప్పడే అభివృద్ధి సాధ్యం



గొల్లపాలెంలో చీకట్ల గోవిందును పరామర్శించి ధైర్యం చెబుతున్న సూర్యప్రకాశ్

కాజులూరు: ప్రభుత్వాలు అందించే సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయిలోని పేదలకు సైతం సక్రమంగా అందినప్పుడే అభివృద్ధి అనేది సాధ్యమౌతుందని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. గొల్లపాలెం శివారు చీకట్లవారిపేటలో ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్న చీకట్ల గోవిందు, రోడ్డు ప్రమాదానికి గురైన వనుం వీరబాబు తదితరులను శనివారం సూర్యప్రకాశ్ పరామర్శించారు. అనంతరం శలపాకలో పార్టీ కార్యకర్త పోలినాటి రాంబాబు, సత్యవాణిల కుమార్తె లక్ష్మీవసుంధర రజస్వల వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమాలలో పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు దంగేటి వెంకన్న, పోతురాజు బాబురావు, ఎస్సీ సెల్ నాయకులు పోలినాటి సూర్యచంద్రం, ఎంపీటీసీ దడాల రమేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ ధర్మదాయశాఖ ఉప కమిషన ర్ నల్లం సూర్యచక్రధర రావు ఆధ్వర్యంలో భక్తుల పూజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,58,050, అన్నప్రసాదం విరాళాల రూ పంలో రూ.42,361తో మొత్తం రూ.2,00,411 ఆ దాయం వచ్చినటుల డీసీ అండ్ ఈఓ తెలిపారు.

## లోక్ అదాలత్‌లో 358 కేసుల పరిష్కారం



న్యాయ విజ్ఞాన సదస్సు, లోక్ అదాలత్‌లను ఉద్దేశించి మాట్లాడుతున్న శంకరరావు

రామచంద్రపురం: పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో 13వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎం.శంకరరావు ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు, నేషనల్ లోక్ అదాలత్‌లు నిర్వహించారు. జడ్జి శంకరరావు మహిళకు అండగా నిలిచే పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో సుమారు రూ.1,88,33,722 విలువైన 358 కేసులు పరిష్కరించారు. వీటిలో సివిల్, క్రిమినల్ కేసులు 223, ఎక్సైజ్ కేసులు 102, ఆరు ప్రి లిటిగేషన్ పిటిషన్లు పరిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శారద, ఏజేఎఫ్‌సీ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్‌లు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, లోక్ అదాలత్ మెంబర్లు సీహెచ్ శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, పీఎస్ జానకి, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కామేశ్వరశర్మ కుటుంబానికి పరామర్శ



కామేశ్వరశర్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు


మండపేట: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అర్చకులు అయినవిల్లి కామేశ్వరశర్మ కుటుంబ సభ్యులను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ పెంకే గంగాధర్, పార్టీ సీనియర్ నాయకుడు తాడి రామారావు పట్టణంలోని శర్మ నివాసానికి వెళ్లి ఆయన కుమారులు సోమనాథం, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి, రుద్రశర్మలను పరామర్శించారు. కార్యక్రమంలో దూలం నాగు, మధు, గరిమెళ్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి చలివేంద్రం ప్రారంభం

రామచంద్రపురం: పట్టణంలోని కోర్టుల సముదాయం వద్ద 13వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎం.శంకరరావు చేతుల మీదుగా శనివారం వేసవి చలివేంద్రం ప్రారంభించారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ మోహన్ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేషనల్ మెగా లోక్‌అదాలత్ పురస్కరించుకుని సుమారు 500 మందికి పైగా కక్షిదారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శారద, ఏజేఎఫ్‌సీ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# పరీక్షల్లో దస్తూరి కీలకం

- ఆకర్షించే అక్షరాలకు అదనపు మార్కులు
- చేతిరాతపై దృష్టి సారిస్తే విజయం సొంతం
- 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు



చేతిరాత ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

రాయవరం: మనం రాసే ప్రతీ అక్షరం చూసే వ్యక్తి మదిలో పదికాలాల పాటు నిలిచిపోవాలంటే అది అందమైన చేతిరాతతోనే సాధ్యం. అందమైన అక్షరాలకు వచ్చే అదనపు మార్కులే పరీక్షల్లో కీలకంగా మారనున్నాయి. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు చేతిరాతపై దష్టి సారించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులు సూచిస్తున్నారు. మంచి దస్తూరీపై దృష్టి సారిస్తే విజయం మీ వెంటే ఉంటుందని విద్యార్థులకు వివరిస్తున్నారు.

**మరో వారం రోజుల్లో పబ్లిక్ పరీక్షలు**

ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట, రాయవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, కాజులూరు మండలాల పరిధిలోని 5,420 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల్లో చేతిరాతపై ప్రత్యేక దృష్టి సారించాలని చేతిరాత నిపుణులు సూచిస్తున్నారు. మంచి చేతిరాతకు బాల్యంలోని పునాది పడాలి. బాల్యం నుంచే అక్షరాలను గుండ్రంగా రాసేలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పరీక్షల్లో అందమైన చేతిరాతకు అదనంగా మార్కులు ఉంటాయని ఉపాధ్యాయులు, అధ్యాపకులు చెబుతున్నారు.

**శాకాహారంతో మేలు**


పరీక్షల సమయంలో శాఖాహారమే ఆరోగ్యానికి మేలు. ఇది శరీరంలో నాడులు, ఇతర వ్యవస్థలను సహజ స్థితిలో ఉండేలా చేస్తుంది. మాంసాహారం ఎక్కువగా తింటే ఆ ప్రభావం నాడీ వ్యవస్థపై పడడంతో చేతిరాతలోనూ మార్పులు వస్తాయి. పరీక్షల సమయంలో వీటికి దూరంగా ఉంటే మంచిది. నూడిల్స్, జంక్ ఫుడ్ వంటి ఆహారం తీసుకోకూడదు. పండ్లు, ఆకుకూరలు తీసుకుంటే చేతిరాతకే కాక మెదడు, జ్ఞాపకశక్తికి ప్రయోజనం చేకూరుతుంది. అలాగే మంచినీరు ఎక్కువగా తాగాలి.

**ఆకట్టుకునేలా...**

అక్షరాలు మరీ చిన్నవి, పెద్దవి కాకుండా ఉండాలి. జవాబు పత్రాలను దిద్దేవారిని ప్రభావితం చేసే విధంగా అక్షరాలు అందంగా, గుండ్రంగా ఉండాలి. మంచి మార్కులు పొందాలంటే మనస్సును హత్తుకునే విధంగా చేతిరాత ఉండాలి. అక్షరాల సైజు ఒకే రీతిలో ఉండాలి. గొలుసు కట్టు రాత మంచిది కాదు. పెన్ను, పెన్సిల్‌ను పట్టుకునే విధానం చక్కగా ఉండాలి. పరీక్షలకు వెళ్లే ముందు రాసే చేతితో బరువులు ఎత్తకూడదు. పరీక్షలు ప్రారంభానికి ముందు చేతి వేళ్లను ముడవాలి. మణికట్టును నెమ్మదిగా గుండ్రంగా తిప్పాలి. మనస్సు ప్రశాంతంగా ఉంటే చేతిరాత బాగా వస్తుంది.

**ఇలా చేస్తే మంచిది**

జవాబు పత్రానికి బోర్డర్ లైన్ లేకపోతే నాలుగు వైపులా ఒక సెంటీమీటరు ఖాళీ వదిలి బోర్డర్‌ను పెన్సిల్‌తో గీయాలి. పదాలు, వాక్యాలు, పేరాల మధ్య తగినంత దూరం ఉండాలి. పదానికి పదానికి మధ్య 10 మిల్లీ మీటర్ల ఖాళీ ఉంటే సరిపోతుంది. దీంతో పాటు వాక్యానికి, వాక్యానికి మధ్య అర సెంటీమీటరు ఖాళీ ఉండాలి. జవాబు రాసిన తర్వాత మరో జవాబు రాసేటప్పుడు రెండింటి మధ్య ఖాళీ రెండు సెంటీమీటర్లు ఉండాలి.




ఇంగ్లిషు కర్సివ్ రైటింగ్

జవాబు పత్రంలో పదాలకు మధ్య ఖాళీ అన్ని చోట్ల ఒకేలా ఉండేలా చూసుకోవాలి. దీని వలన చేతిరాత ఎలా ఉన్నప్పటికీ జవాబు పత్రం ఆకర్షణీయంగా కన్పిస్తుంది. ఆంగ్లంలో రాసేటప్పుడు కర్సివ్ కేపిటల్ లెటర్స్ ఉపయోగించడం వలన జవాబు పత్రం మరింత అందంగా కన్పిస్తుంది. ఏదైనా పదాన్ని, లైను కొట్టివేయాల్సి వస్తే ఒకే గీతను ఉపయోగించి సమాంతరంగా కొట్టివేయాలి. గజిబిజిగా, ముద్దగా రుద్దినట్లుగా కొట్టివేయరాదు. భాషా, అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. బాల్‌పాయింట్ కన్నా జెల్ పెన్ను వాడడం మంచిది. ఒకవేళ తప్పనిసరిగా బాల్ పాయింట్ పెన్ను ఉపయోగించాలనే నిబంధన ఉంటే రబ్బరు గ్రిప్ ఉండి సన్నగా రాసే బాల్‌పెన్ను వాడాలి.

**విశ్రాంతి లేకపోతే..**

సరైన విశ్రాంతి లేకపోతే అలసటకు గురై ఆ ప్రభావం చేతిరాతపై పడుతుంది. కూర్చునే భంగిమ, కలం పట్టుకునే విధానం, జవాబు పత్రం స్థానం చేతిరాతపై ప్రభావం చూపుతుంది. ఇబ్బందికరంగా ఉండే భంగిమలో కూర్చుని పరీక్ష రాయకూడదు. చేతివేళ్లతో పెన్నుపైన, జవాబుపత్రం పైన ఎక్కువ ఒత్తిడి కలిగించకూడదు. ఒత్తిడి ఎక్కువయ్యే కొద్ది మానసిక ఆందోళన పెరుగుతుంది. పరీక్షల్లో సామాన్య, సాంఘిక, గణితంలో అడిగిన చిత్రపటాలను అందంగా గీయాలి. అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం రాయాలి. శీర్షికలు, ఉపశీర్షికలు, ముఖ్యాంశాలు స్పష్టంగా కన్పించేలా కింద గీతలు గీయాలి.